

సోమనర్సింహారెడ్డికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

## నర్సింహారెడ్డికి కంచర్ల నివాళి

అడ్డగూడూరు, మే 11 : మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పునూతుల సోమ నర్సింహారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మృతి చెందారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆదివారం ఆయన మృతదేహానికి నివాళులులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అడ్డగూడూరు మాజీ ఎంపీటీసీ పూలపల్లి జనార్దన్‌రెడ్డి, నాయకులు కంచర్ల యాదగిరిరెడ్డి, బుక్క రోషిరెడ్డి పాల్గొన్నారు.

## తూకంలో మోసం లేకుండా కొనుగోళ్లు చేయాలి : బీఆర్ఎస్



ఆత్మకూరు(ఎం) : పల్లెపహాడ్ కొనుగోలు కేంద్రంలో తూకాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), మే 11 : తూకంలో ఎలాంటి మోసం లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మండలంలోని పల్లె పహడ్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు అధికారులను కోరారు. గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు పరిశీలించి మాట్లాడారు. 40కిలోల ధాన్యం బస్తాకు 1కిలో2వందల గ్రాముల ధాన్యాన్ని అదనంగా తూకం వేయడంతో పాటు లారీల్లో లోడ్ చేసేందుకు వెయిటింగ్ చార్జీ పేరుతో ఒక్కో బస్తాకు రూ.4 చొప్పున వసూలు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం రాశులు పోసి 20రోజులు గడుస్తున్నా నేటికీ 40 మంది రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయలేదన్నారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకున్న వే బ్రిడ్జి వద్ద రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి తిరిగి అదే ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తున్నాడని ఆరోపించారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కాలే ల్లేల్లేశం, మండల కార్యదర్శి గజ్జెల్లి శంకర్, పెంటయ్య, సురేశ్, సత్తయ్య పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు

## నృసింహుడి జయంత్యుత్సవాలు సంపూర్ణం

యాదగిరిగుట్ట, మే 11 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి స్వయంభూ ప్రధానాలయంలో ఈ నెల 2న ప్రారంభమైన లక్ష్మీనృసింహుడి జయంతి ఉత్సవాలు ఆదివారం రాత్రి నృసింహ ఆవిర్భావంతో ముగిశాయి. ఉదయం 7 గంటలకు ప్రధానాలయంలో నిత్యాహవనం, మూలమంత్ర జపాలు, లక్ష్మీ సూక్త, విష్ణుసహస్రనామ పారాయణాలు చేపట్టి స్వామివారికి అభిషేకం నిర్వహించి, మహా పూర్ణాహుతి గావించారు. సాయంత్రం 7 గంటలకు ఆలయంలో అర్చకులు నృసింహ జయంతి వేడుక జరిపించి, ఆవిర్భావ నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి చేపట్టి ఉత్సవాలకు ముగింపు పలికారు. పాత గుట్ట పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూర్ణాహుతి, అష్టోత్తర శతఘటాభిషేకం, నృసింహ జయంతి– నృసింహ ఆవిర్భావ వేడుకలు వైభవంగా జరిపారు.

### సామూహిక గిరిప్రదక్షిణ

స్వామివారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా దేవస్థానం సామూహిక గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఈఓ వెంకట్‌రావు ప్రారంభించారు. ఉదయం 5.45 గంటలకు కొండకింద గాలిగోపురం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షిణ చేపట్టారు. సుమారు 2 కిలోమీటర్ల వరకు గిరిప్రదక్షిణ చేసి శ్రీవారి మెట్ల ద్వారా కొండపైకి చేరుకున్నారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మ, డీఈఈలు వూడెపు రామారావు, దయాకర్‌రెడ్డి, ఏఈఓలు గజవెల్లి రమేశ్‌బాబు, రఘుబాబు, ఆలయ అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



భూదాన్ పోచంపల్లి పట్టణ ప్రధాన రహదారిలో వెలగని బటర్ ఫ్లై లైట్లు

## వెలగని బటర్ ఫ్లై లైట్లు

భూదాన్ పోచంపల్లి, మే 11 : పట్టణంలో ప్రధాన రహదారి మధ్య ఏర్పాటు చేసిన బటర్‌ఫ్లై లైట్లు వెలగడం లేదు. ప్రపంచ సుందరీమణులు పోచంపల్లికి వస్తున్నారని ఆర్భాటంగా స్తంభాలకు తెల్ల రంగు వేస్తున్నారే తప్ప వీధి లైట్లు వెలగక పోతే మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. వీధి లైట్లు వెలుగక పోచంపల్లి వీధులు అంధకారంలో మగ్గుతున్నాయని పట్టణ ప్రజలు అంటున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని వీధి లైట్లు వెలిగేలా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



ఆలేరు మార్కెట్ యార్డులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి : ఆర్డీఓ కృష్ణారెడ్డి

ఆలేరురూరల్, మే 11 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. ఆలేరు మార్కెట్ ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, రైతులు ఉన్నారు.

## రేపు పాలీసెట్

యాదగిరిగుట్ట, మే 11 : పాలిటెక్నిక్ – 2025 ప్రవేశ పరీక్ష (పాలీసెట్–2025) ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్. డి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జిల్లా పరిధిలోని 6 పరీక్షా కేంద్రాల్లో ఎంట్రెన్స్ టెస్ట్ జరుగనున్నట్లు తెలిపారు. పట్టణంలోని సీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, జాగృతి డిగ్రీ కళాశాలు, ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల, గాయత్రి బాలికల, యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు జిల్లాలోని 6 కేంద్రాల్లో 1754 విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఇందులో విద్యార్థులు 910, విద్యార్థినులు 844 మంది ఉన్నట్లు చెప్పారు. పరీక్ష సమయం కంటే గంట ముందు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, హెచ్‌బీ పెన్సిల్, బ్లాక్ బాల్ పాయింట్ పెన్ను, ఎరేజర్‌ను విధిగా తీసుకురావాలని చెప్పారు. పరీక్ష ప్రారంభమైన తర్వాత ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించబడదని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

## ఘనంగా బీరప్ప స్వామి కల్యాణం

రామన్నపేట, మే 11 : బీరప్ప స్వామి కామారాతి దేవి కల్యాణ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కురుమలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు కళాకారులు ఆటపాట అలరించింది. నేడు స్వామివారి కల్యాణం జరుగనుంది. కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, మోటె లక్ష్మణ్, ఈతాపుల రాజు, మాజీ ఎంపీటీసీలు గొరిగే బీరప్ప, గొరిగే నర్సింహ, నాయకులు సింధం లింగయ్య, మిర్యాల మల్లేశం, ఎర్ర మల్లేశం, మోటె మల్లేశం, మోటె మహేశ్, గొరిగే శంకరయ్య పాల్గొన్నారు.



సమ్మె పోస్టర్లను అవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

## దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి : నర్సింహ

మోత్కూరు, మే 11 : ఈ నెల 20న జరుగనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరెళ్ల నర్సింహ అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్లను ఆదివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నో ఏండ్లుగా కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లను తెచ్చిందని, అవి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్కే శ్రీను, నర్సింహ, శ్రీశైలం, రాజు, శివ, లతీఫ్ పాల్గొన్నారు.

### 'సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి'

పెద్దవూర : ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు దొంతాల నాగార్జున అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. 8గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచేందుకు కుట్ర చేస్తుందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఉపాధి హామీ పనిని 200 రోజులకు పెంచి రూ.600 కూలీ ఇవ్వాలని, దేశంలో దళితులు, గిరిజనులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమలో దోరేపల్లి మల్లయ్య, ఉరే నాగయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.



సమీక్షలో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

## 2 వేల మందితో పటిష్ట బందోబస్తు

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నందికొండ, మే 1 : ప్రపంచ పోటీల్లో పాల్గొనే ప్రపంచ సుందరీమణులు నేడు బుద్ధవనాన్ని సందర్శించనున్న నేపథ్యంలో 2000 మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు చేయనున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. బుద్ధవనం, విజయవిహార్‌లో చేపడుతున్న భద్రతా చర్యలు, సిబ్బంది విధులపై హిల్‌కాలనీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో అధికారులతో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే ప్రపంచ సుందరీమణుల్లో సుమారు 30 మంది మే 12న బుద్ధపూర్ణిమ సందర్భంగా స్థానిక బుద్ధవనాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ నుంచి బయల్దేరి నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్ 4.30 నిమిషాలకు చేరుకుంటారన్నారు. విజయవిహార్ ప్రధాన ద్వారం వద్ద ఫొటో షూట్ అనంతరం 5.45కు బుద్ధవనం చేరుకుంటారన్నారు. అనంతరం మహాస్థూపం చేరుకొని ధ్యానంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం జాతక పార్కులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి రాత్రి 8 గంటలకు భోజనం చేసి తిరిగి హైదరాబాద్ వెళ్తారని చెప్పారు.

అనుమతుల కోసం రెడ్, ఆరెంజ్, గ్రీన్, వైట్ పాస్‌లను అనుమతిస్తున్నామని, రెడ్ సందరీమణులతో ఉండే వీఐపీలకు, ఆరెంజ్ అధికారులు, గ్రీన్ బయట విధులు చేపట్టే వారికి, వైట్ మీడియాకు పాస్‌లను జారీ చేసినట్లు పేర్కొన్నారు. బుద్ధవనం, విజయవిహార్‌లో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 60 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు 800 మంది కానిస్టేబుళ్లతో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. సుందరీమణులు వచ్చే సమయంలో ఎవరైనా నిరసనలు, ఆందోళనలు చేపడితే వారిపై శాఖా పరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు మౌనిక, శ్రీనివాస్ రావు, డీఎస్పీలు రాజశేఖర్‌రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఆటోలు ఢీ.. ముగ్గురికి గాయాలు

ఆలేరురూరల్, మే 11 : ఆలేరు శివారులోని హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలో శనివారం రాత్రి రెండు ఆటోలు ఎదురుగా ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌హెచ్ఓ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా లింగాల గణపురం మండలం కుందారం గ్రామానికి చెందిన చింత ప్రభాకర్, లక్ష్మీ అన్నపూర్ణమ్మ హైదరాబాద్‌లో తమ బంధువుల పెళ్లికి వెళ్తున్నారు. శనివారం రాత్రి 11గంటల సమయంలో ఆలేరు పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ చౌదరి దాబా వద్దకు రాగానే జనగాం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆలేరు పట్టణానికి చెందిన నల్లగోని శ్రీనివాస్ ఆటో ప్రభాకర్ ఆటోను ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించడంతో జనగాంలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చింత వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## నేలపై పాకిస్థాన్ జెండా



భువనగిరి ప్రధాన రహదారిపై పాకిస్థాన్ జెండా వేసి నిరసన తెలిపిన స్థానికులు

భువనగిరి అర్బన్, మే : భారతదేశం–పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశ వ్యాప్తంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో భువనగిరి పట్టణంలోని వినాయక చౌరస్తాలో స్థానికులు ప్రధాన రహదారిపై పాకిస్థాన్ జెండాలు అంటించి, పాకిస్థాన్ డౌన్ డౌన్ అంటూ యువకులు నినాదాలు చేశారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఎంఈఓ జ్యోతి



గవ్వ జ్యోతి

రామన్నపేట, మే 11 : వేసవి శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి గవ్వ జ్యోతి అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 15 రోజుల పాటు 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలోని పోచంపల్లి, జూలూరు, పిల్లాయిపల్లి జడ్పీహెచ్ఎస్‌లలో ఈనెల 15 నుంచి 15 రోజుల వరకు 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి పి.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని, శిక్షణలో యోగా, ధ్యానం, క్యారమ్స్, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, అవుట్ డోర్ గేమ్స్ గురించి శిక్షణ ఇయ్యనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రవేశం కోసం ఆయా పాఠశాలల హెచ్ఎంలను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని చెప్పారు.



సిరిని సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

## పదో తరగతి విద్యార్థినికి సన్మానం

ఆత్మకూరు(ఎం), మే 11 : మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని రచ్చ సిరి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మండల స్థాయిలో సెకండ్ ర్యాంక్ సాధించింది. ప్రతిభ కనబర్చిన సిరిని ఆదివారం పద్మశాలి సంఘం నాయకులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో పద్మశాలిసంఘం జిల్లా నాయకులు రచ్చగోవర్ధన్, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తౌర్ర విష్ణు, ఎలగందుల శ్రీను, యాదగిరి, పురుషోత్తం, లింగయ్య, శ్రీకంత్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు(ఎం), మే 11 : మండల కేంద్రానికి చెందిన గట్టు భిక్షపతి, పల్లెర్లకు చెందిన మోత్కూరు శంకరయ్య, మట్టిపల్లి సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేహెచ్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల హరిదీప్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున అందించగా స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మృతుల కుటుంబాలకు అందించి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కొరె భిక్షపతి, పల్లెర్ల మాజీ సర్పంచ్ నాయిని నరసింహారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, సామ నరేందర్‌రెడ్డి, నాతిరాజు, ఇస్తారి తదితరులున్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి అర్బన్, మే 11: పట్టణంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో హైదరాబాద్ ప్లాట్ ఫారం వద్ద సుమారు 38 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు భిక్షాటన చేసేవాడని ఆర్టీసీ సిబ్బంది, స్థానికులు చెప్పారు. అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చునని పేర్కొన్నారు. మృతదేహాన్ని ఏరియా దవాఖానాకు తరలించి మార్చురీలో ఉంచారు. మృతుడు తెల్లని చొక్కా, నీలం రంగు ప్యాంటు, 5.6 ఎత్తు ఉంటాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

## కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి : ఉపేందర్

రామన్నపేట, మే 11 : దివ్యాంగుల హక్కుల సాధనకోసం ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి వనం ఉపేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సుభాష్ సెంటర్‌లో ఆదివారం దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం రూపొందించిన కరపత్రాలను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు, అంత్యోదయ రేషన్ కార్డులు, రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు అంజయ్య, కార్యదర్శి లింగస్వామి, ఉపాధ్యక్షుడు నాగు నర్సింహ, సభ్యులు శ్రీధర్, నర్సింహ, భాషయ్య, కాంతకుమార్, సత్యనారాయణ, పరుశరాములు పాల్గొన్నారు.

## చెట్లు నరికివేత



శాలిగౌరారం, మే 11 : మండలంలోని వల్లాల గ్రామంలో గల చిన్నరాయుని చెరువు కట్ట మీద ఏపుగా పెరిగిన చెట్లను కొంత మంది అక్రమార్కుల అండతో నేలమట్టం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన ఓవ్యక్తి చెట్లను కొట్టేయడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రమణేశ్వరంలో నేడు సైనికుల రక్షణకు మహాపూజ

భువనగిరి కలెక్టరేట్, మే 11 : పట్టణ పరిధిలోని రమణేశ్వరంలో శివ శక్తి శిరిడీ సాయి అనుగ్రహ మహాపీఠంలో భారతీయ సైనికుల రక్షణ, విజయ ప్రాప్తి కోసం నేడు మహాపూజ నిర్వహించనున్నట్లు జగద్గురు రమణానంద మహర్షి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని రక్షించే సైన్యం, త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని శుభం కలగాలని కోరుతూ రుద్ర హవనం, విశేష రుద్రాభిషేకంతో పాటు సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## తాటి చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు

వలిగొండ, మే 11 : మండలంలోని పహిల్వాన్‌పూర్ గ్రామ పరిధిలో ఆదివారం ప్రమాదవశాత్తు గీత కార్మికుడు తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పహిల్వాన్ పూర్ గ్రామానికి చెందిన వట్టిపల్లి ముత్యాలు శనివారం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. స్థానికులు గమనించి 108 సాయంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

మోత్కూరు, మే 11 : మండలంలోని దాచారం గ్రామానికి చెందిన అంతటి ఏలేందర్ (35) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనతో పాటు 2002–03 సంవత్సరంలో పదోతరగతి కలిసి చదువుకున్న స్నేహితులు రూ.32 వేలు సమీకరించి ఆదివారం ఏలేందర్ కుటుంబ సభ్యులకు అందించారు.



ఆత్మకూరు(ఎం) ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



సంస్థాన్ నారాయణపురం : జనగాం గ్రామంలో..

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మకూరు(ఎం), మే 11 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009–10 సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులను సన్మానించారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని జనగాం జడ్పీహెచ్ఎస్‌లో 1999–2000 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 25 ఏండ్ల తరువాత కలువడంతో విద్యార్థులు ఆనందంగా గడిపారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.